క్లుప్తంగా

నేడు పోలమాంబ ఆలయంలో కుంకుమపూజలు



శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ గురువారం తెలిపారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 9గంటలకు వేదపండితులతో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ జరిపించనున్నట్లు ఆయన పేర్కొంటూ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో షాపులకు టెండర్లు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఖాళీ స్థలాలు, పక్కా షాపులకు 5 సంవత్సరాల కాలపరిమితికి టెండర్లు పిలుస్తున్నట్లు డిపో మేనేజర్ కనకదుర్గ తెలిపారు ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14 నుంచి 27వ తేదీవరకు టెండర్ ఫారాలు డిపో మేనేజర్ కార్యాలయంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలను ఈనెల 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పార్వతీపురం మన్యం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఉన్న టెండర్ బాక్సులో వేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ బాక్సు తెరుస్తామని వివరించారు.

బందలుప్పి పీహెచ్‌సీ పరిశీలన



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే విజయ్ చంద్ర గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా వైద్యులు, సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన సేవలు అందించే కృషి చేయాలని వైద్యసిబ్బందిని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశీపట్నంలో మలాథియాన్ పిచికారీ

మక్కువ: మండలంలోని కాశీపట్నం పంచాయతీలో గురువారం మక్కువ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో మలాథియాన్ పిచికారీ జరిపించారు. వర్షాలు ప్రతిరోజూ కురుస్తున్నందున దోమలు విజృంభిస్తున్నాయి. పంచాయతీ ప్రజలు దోమలబారిన పడకుండా నివారించేందుకు హెల్త్ అసిస్టెంట్ కాతా రవి పర్యవేక్షణలో ఇంటింటా మలాథీన్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఇంటిచుట్టూ మురుగునీరు లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. దోమతెరలు వినుయోగించాలని సూచించారు.

కాలువల్లో మురుగు తొలగింపు



కాలువల్లో మురుగును తొలగిస్తున్న దృశ్యం

మక్కువ: మండలకేంద్రం మక్కువలోని పలు వీధుల్లో గల కాలువల్లో పేరుకుపోయిన మురుగును పారిశుద్ధ్య కార్మికులు తొలగిస్తున్నారు. మార్కెట్‌రోడ్డు, నాయుడువీధిలో గురువారం పారిశుద్ధ్యపనులు జరిపించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాలువల్లో మురుగునీరు చేరి, దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా కాలువల్లో నీరు రహదారిపైకి ప్రవహించడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలువలపై ఏర్పాటుచేసిన పలకలు తీసి, మురుగును తొలగిస్తున్నారు.

28న వాహనాల వేలం

పాలకొండ: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహిస్తామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు ప్రథమ దరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి స్టేషన్ ఆరవణలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో వాహనాలు దక్కించుకున్నవారు అదే రోజు చలనా రూపంలో మొత్తం నగదు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

జలమయం

సౌందర్య థియేటర్ వెనుక గల కృష్ణా కాలనీలో ఇలా



మహాత్మా జ్యోతి బాపూలే వసతి గృహంలో వెళ్తున్న వరద నీరు



- తడిసి ముద్దైన జిల్లాకేంద్రం
- 85.8 మిమీ వర్షపాతం నమోదు
- రహదారిపై చేరిన వరదనీరు
- ఇబ్బందులు పడిన ప్రజలు, విద్యార్థులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి భారీ నుంచి అతి భారీ వర్షం కురవడంతో పట్టణంలో పట్టణ ప్రధాన రహదారితోపాటు పలు కాలనీలు జలమయమయ్యాయి. పార్వతీపురంలోని సౌందర్య థియేటర్ వెనుక గల కృష్ణానగర్ కాలనీలో, మహాత్మ జ్యోతి బాపూలే వసతిగృహం, మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ కాలనీల్లో వర్షపునీరు అధికంగా చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బెలగాం కాలనీలో రహదారి, సౌందర్య థియేటర్ వెనుక కృష్ణాకాలనీ చెరువులను తలపించాయి. బెలగాం వద్ద గల ప్రధాన రహదారి, బ్యాంకులో సైతం వర్షపు నీరు చేరింది. మహాత్మ జ్యోతిబాపూలే వసతి గృహంలో వరదనీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

● మండలంలోనూ అదే పరిస్థితి

పార్వతీపురం మండలంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. పుట్టూరు గ్రామం సమీపంలో సాకిగెడ్డ పొంగి రహదారిపై ప్రవహించడంతో స్కూల్ బస్సు వరదనీటిలో చిక్కుకుంది. స్థానికుల చొరవతో విద్యార్థులను ఆటోల్లో పాఠశాలలకు తరలించారు. సాకిగెడ్డ పొంగడంతో గోచెక్క, బందలుప్పి, మక్కువ, వైఎస్‌వలస గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి.

● ఆక్రమణలే కారణమంటున్న స్థానికులు

జిల్లా కేంద్రంలో నెల్లిచెరువు గట్టు, వరహాల గెడ్డతో పాటు పలు బందలలో ఉన్న ఆక్రమణల కారణంగా పట్టణానికి వరద ముంపు భారీగా ఏర్పడుతోంది. పట్టణ శివారు కాలనీల్లో లేఅవుట్లు వేసినా సంబంధిత యజమానులు కాలువలను సక్రమంగా నిర్మించని కారణంగా జిల్లాకేంద్రం ముంపు బారిన పడుతోంది. ఈ ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

● గెడ్డ నీటి ప్రవాహం తొలగించాలి

బెలగాం గెడ్డ నీటి ప్రవాహం పెరగడం వల్ల చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సీపీఎం పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బంకురు సూరిబాబు, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.



పంట పొలాల్లో చేరిన వరద నీరు



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో చేరిన వరద నీరు



గెడ్డను ఆక్రమిస్తూ నిర్మిస్తున్న భవనం



పార్వతీపురం రాయగడ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



పుట్టూరు సమీపంలో వరద నీటిలో చిక్కుకున్న బస్సు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ప్రజామోదంతోనే ఉపాధి పనులు



ఈఓపీఆర్డీ కుమారవర్మ

సీతానగరం: ఉపాధిహామీ పనులు చేపట్టడానికి భవిష్యత్ ప్రణాళికలు తయారీకి నిర్వహించనున్న గ్రామసభలో ప్రజలు పాల్గొని ఆమోదించడానికి సహకరించాలని ఈఓపీఆర్ఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. మండలంలో శుక్రవారం నిర్వహించనున్న గ్రామసభలపై పంచాయతీ కార్యదర్శులు ఉపాధిహామీ పథకం అధికార సిబ్బందితో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను అధ్యక్షతన సమీక్షాసమావేశం జరిగింది. ఈ మేరకు ఈఓపీఆర్డీ మాట్లాడుతూ 2024-25 -26 ఆర్థిక సంవత్సరంలో జరగనున్న ఉపాధిపనులు ప్రారంభించడానికి ముందు గ్రామసభలో ఆమోదం పొందిన ప్రాప్తికి పనులు చేపట్టవలసి ఉందన్నారు. సర్పంచ్‌ల పర్యవేక్షణలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మోతాదు మించితే అనర్థమే..



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సౌజన్య

వీరఘట్టం: అధిక మోతాదులో ఎరువులు వినియోగిస్తే పంటకు అనర్థం తప్పదని మండల వ్యవసాయశాఖ అధికారి జె సౌజన్య సూచించారు. మండలంలోని చలివేంద్రి గ్రామంలో గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు.

ఇందులో భాగంగా గాప్ (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్), ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. సాధారణ ఎరువుల కంటే నానో యూరియా, నానో డీఏపీ వినియోగం వల్ల పంటకు ఎంతో మేలని సూచించారు. అలాగే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగ కుటుంబానికి చేయూత



దివ్యాంగుడు నెల్లి శంకర్‌కు దుకాణాన్ని అప్పగిస్తున్న ట్రస్టు సభ్యులు

భామిని: మండలంలోని సతివాడకు చెందిన దివ్యాంగుడు నెల్లి శంకర్ కుటుంబానికి కొత్తూరుకు చెందిన భగత్‌సింగ్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. సతివాడ గ్రామంలో చిన్న దుకాణం ఏర్పాటు చేసి శంకర్ కుటుంబానికి అప్పగించారు. భవన నిర్మాణ కార్మికుడైన శంకరరావు ఈ ఏడాది ఫిబ్రవరిలో సెంట్రింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారంగా మారింది. ఆ కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని భగత్‌సింగ్ ట్రస్ట్ సభ్యులు శంకర్ కుటుంబానికి జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో గ్రామంలో చిన్న దుకాణం ఏర్పాటు చేశారు.

బకాయి జీతాలు చెల్లించాలి



భద్రగిరి సీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న సెక్యూరిటీ గార్డులు, పారిశుద్ధ్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: పెండింగ్‌లో ఉన్న తమ జీతాలు చెల్లించాలని మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలోని విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్యం, సెక్యూరిటీ సిబ్బంది డిమాండ్ చేశారు. సీహెచ్‌సీ ఎదుట గురువారం వారంతా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు వెంకటరావు, శ్రీరాములు, గౌరమ్మ, బారికి తదితరులు మాట్లాడుతూ గత ఐదు నెలలుగా తమ జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉందన్నారు. గత మూడేళ్లుగా పీఎఫ్ బకాయిలు మొత్తం చెల్లించాలని, ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి ఆప్కాస్‌లో చేర్చాలని, జీఓ 549, 43 ప్రకారం వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే సెప్టెంబర్ 5 నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

స్కిల్ హబ్ సెంటర్‌ను పరిశీలించిన పీడీ



స్కిల్ హబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న పీడీ రాణి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ సెంటర్‌ను జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వి.రాణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్కిల్ హబ్ సక్రమంగా నిర్వహిస్తున్నదీ లేనిది, శిక్షణ పొందేందుకు నిరుద్యోగులు ఆశక్తి చూపుతున్నదీ లేనిది తదితర అంశాలపై ఆరా తీసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్కిల్ హబ్ వద్ద త్వరలో కిశోర బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆమె వెంట భద్రగిరి సీడీపీఓ సీహెచ్ సుశీలదేవి, సూపర్‌వైజర్లు ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే..



గుమడ వద్ద ప్రధాన రహదారిపై గోతులో నిలిచిన వర్షపు నీరు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు వరకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో వర్షం పడితే ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతుంది. దీంతో వాహనదారులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రధాన రహదారి అంతా వర్షపు నీరుతో నిండిపోతుంది. ఈ మార్గంలో వాహనాలపై ప్రయాణం భయాందోళనలు కలిగిస్తోంది. ఈ రహదారిపై స్థానికులు పలుమార్లు ఆందోళనలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యశాఖ కార్మికులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్యం, భద్రత, చెద పురుగుల నివారణ కార్మికులు, సూపర్ వైజర్లకు జీతాలు ప్రతినెలా చెల్లించేలా చూడాలని జిల్లా పర్యటనకు వస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరుతున్నామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ జిల్లాలో ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆసుపత్రుల్లో మొత్తం 122 మంది కార్మికులు ఉన్నారన్నారు. వారు టీవీటీ, స్కాట్లాండ్ గ్రూప్ ఏజెన్సీలో పని చేస్తున్నారన్నారు. వారందరికీ ప్రతి నెలా జీతాలు చెల్లించేలా జిల్లాకు రానున్న మంత్రికి శుక్రవారం వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణంలోని ఆటోనగర్ సబ్‌స్టేషన్, పాచిపెంట మండలంలోని గురివినాయుడు పేట సబ్‌స్టేషన్ పరిధిలో వార్డులు, గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుం దని ఎలక్ట్రికల్ ఈఈ కె.గోపాలరావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

టౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ



నూతన సీఐ అప్పలనాయుడు

సాలూరు: సాలూరు టౌన్ సీఐగా అప్పలనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి నుంచి ఆయన బదిలీపై సాలూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పోలీసులు ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడ సీఐగా పనిచేసిన వాసు నాయుడు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ అయ్యారు.

యిండుపూరు కృష్ణమోహన్ మృతి



యిండుపూరు కృష్ణమోహన్(ఫైల్)

పార్వతీపురం: పట్టణంలోని శ్రీ లక్ష్మీబాలాజీ జ్యూయలరీ అధినేత యిండుపూరు కృష్ణమోహన్ కొద్ది రోజులుగా అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. ఆయన మృతికి బంగారు వర్తక సంఘాలు సంతాపం తెలియజేస్తూ షాపులను స్వచ్ఛందంగా మూసివేశాయి. అలాగే పార్వతీపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేష్, గోపాలరావు, వెంకటేష్, బాబు, విజయరామరావు తదితరులు తమ సంతాపం తెలియజేశారు.

అధ్వానంగా రహదారి



అధ్వానంగా ఉన్న రోడ్డును చూపుతున్న డెప్పిగూడ గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడుగూడ పంచాయతీ డెప్పిగూడ నుంచి రెల్లిగూడ గ్రామాల మధ్య గల రహదారి బురదమయమై అధ్వానంగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు డెప్పిగూడ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డెప్పిగూడ నుంచి రెల్లిగూడ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు మధ్య కేవలం కిలోమీటరు రహదారి ఈ వర్షాలకు పూర్తిగా బురదమయం అయిందని, కాలినడకన సైతం రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందని, తప్పనిసరి పరిస్థితుల్లో చుట్టూ పది కిలోమీటర్లు తిరిగాల్సి వస్తోందని, ఈ పరిస్థితుల దృష్ట్యా అధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మిస్తే తమతో పాటు సమీప గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగుతాయని గిరిజనులు కోరుతున్నారు.

ద్రవజీవామృతం తయారీ



మిర్తివలస ప్రాథమిక పాఠశాల వద్ద తయారు చేస్తున్న ద్రవజీవామృతం

బలిజిపేట: మండలంలోని మిర్తివలస పాఠశాల, అంగన్వాడీ కేంద్రం వద్ద న్యూట్రీగార్డెన్ నిమిత్తం 100లీటర్ల ద్రవజీవామృతాన్ని ప్రకృతి వ్యవసాయం ఎంపీఆర్ లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం తయారుచేశారు. ఇందుకు 5లీటర్ల దేశీయ ఆవు మూత్రం, 5 కిలోల ఆవుపేడ, కిలో బెల్లం, కిలో శనగపిండి, పిడికెడు పుట్టమన్ను, 100లీటర్ల నీరు ఉపయోగించారు. వాటిని పూర్తిగా కలిపిన తరువాత 5రోజులు నిల్వ ఉంచి ఆ తరువాత మొక్కలకు ఎరువుగా వినియోగించడం వల్ల సూక్ష్మపోషకాలు లభించి మొక్కలు బాగా ఎదిగి ఫలితాన్ని అందిస్తాయని ఎంపీఆర్ తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ తిరుపతిరావు, వీఏఏ ప్రశాంతి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

సీతానగరం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పార్వతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖమంత్రి సత్యప్రసాద్ పీహెచ్‌సీని సదర్శించనున్నందున ముందుగా పీహెచ్‌సీని సందర్శించి ఇక్కడున్న వనరులు, మందుల లభ్యత, రోగులకు అందిస్తున్న సేవల రికార్డులపై స్థానిక వైద్యాధికారులతో సమీక్షించి తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశామన్నారు. వైద్యరోగ్య శాఖ మంత్రి సందర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.జగన్మోహనరావును ఈ సందర్భంగా ఆమె కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, డీఎంఓ డాక్టర్ మణి, స్థానిక డాక్టర్లు ఉషారాణి, పావని, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అందని 24 గంటల వైద్య సేవలు



కొమరాడ పీహెచ్‌సీ

కొమరాడ: పీహెచ్‌సీల్లో 24 గంటల వైద్య సేవలు గతంలా అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో వైద్య సేవలు రోగులకు అందించేది. ఇప్పటి ప్రభుత్వం దీన్ని పట్టించుకోకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. మండలంలో కొమరాడ, కూనేరు రామభద్రపురం, మాదలింగి గ్రామాల్లో మూడు పీహెచ్‌సీలు ఉన్నాయి. ఇక్కడ గతంలా ప్రస్తుతం వైద్య సేవలు అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యులు సమావేశాలంటూ వెళ్లిపోతుండడంతో ప్రస్తుతం జ్వరాల సీజన్‌లో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. ఇక్కడ వైద్యులు అందుబాటులో లేకపోతుండడంతో క్షేత్ర స్థాయి సిబ్బంది ఇక్కడకు వచ్చే వారికి తూతూ మంత్రంగా వైద్యం అందించి పరిస్థితి విషమిస్తే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని రోగులు వాపోతున్నారు. పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్య సేవలు అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గండి పూడ్చివేత



ప్రధాన రహదారి పరిధిలో పడిన గండి



అధికారులు పూడ్చిన గండి ప్రదేశం

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి పార్వతీపురం - శ్రీకాకుళం ప్రధాన రహదారి పరిధిలోని తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ సమీపంలో రహదారి మధ్యలో పెద్ద గండి పడింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు చేసే వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏ మాత్రం ఏమరు పాటుగా ఉన్న ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆర్అండ్‌బీ శాఖ, రెవెన్యూ శాఖ, పోలీసులు గండి ప్రదేశాన్ని సందర్శించి యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోలీసులు అవసరమైన చర్యలను చేపట్టారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా గండిని పూడ్చినట్లు ఆర్అండ్‌బీ జేఈ పి.ప్రమీల తెలిపారు.